క్లుప్తంగా

ఘనంగా దత్తాత్రేయ జయంతి



సాయిబాబా విగ్రహానికి అన్నాభిషేకం

విజయనగరం టౌన్: సద్గురు శ్రీ దత్తాత్రేయ జయంతి ఉత్సవం రింగ్‌రోడ్డులోని సింహాద్రి నగర్‌లో గల సాయిబాబా ఆలయంలో ఆదివారం వైభవంగా జరిగింది. ఆలయ అధ్యక్షుడు కరణం జనార్దనరావు సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో సాయినాథుని విగ్రహానికి అన్నాభిషేకం చేపట్టారు. అర్చకులు శ్రీరామ్‌శర్మ, రామకృష్ణశర్మలు వేదమంత్రాల నడుమ ఈ కార్యక్రమం సాగింది. మధ్యాహ్నం సుమారు వెయ్యి మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కోదండ రామ రమేష్, పెంటపాటి నర్సింహరావు (పెదబాబు), హరిగోపాల్, మహేష్, విజయప్రభాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పర్యవేక్షణ



పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: నగరంలోని వివిధ ప్రాంతాలలో విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదివారం ఉదయం పర్యటించి పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. ముఖ్యంగా చెత్త తరలింపు.. తడి, పొడి చెత్త సేకరణ వంటి అంశాలను గమనించారు. ఈ సందర్భంగా సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఎప్పటికప్పుడు చెత్తను తరలించాలన్నారు. ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తూ నగరం పరిశుభ్ర వాతావరణంలో ఉండే విధంగా చూడాలన్నారు. ఇప్పటికే సచివాలయాల వారీగా ప్రత్యేక వాహనాలను కూడా అందించామన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం



అయ్యన్నపేటలో యువతకు, పెద్దలకు సూచనలు చేస్తున్న వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్, ఎస్సై నరేష్

విజయనగరం క్రైమ్: సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్ అన్నారు. మండలంలోని అయ్యన్నపేటలో ఆదివారం రాత్రి గ్రామసందర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడుతూ, దొంగతనాలు జరగకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో సూచించారు. సైబర్ నేరాలు జరిగే తీరుతెన్నులను వివరించారు. ట్రాఫిక్ రూల్స్, రెగ్యులైజేషన్‌పైన యువతకు తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎస్సై నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

నివాళులు..



సాబ్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న యూటీఎఫ్ సభ్యులు

విజయనగరం అర్బన్: జిల్లా కేంద్రంలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో పీడీఎఫ్ మాజీ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ వర్ధంతి ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి డి.రాము, ప్రధాన కార్యదర్శి కేవీపీకే ఈశ్వరరావు, జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ బి.రాం ప్రసాద్, కె. అప్పారావు, వివిధ మండల కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

'సుపథ' ప్రతిభా పరీక్షలు



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

శృంగవరపుకోట: ఎస్.కోట ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఆదివారం 'సుపథ' సంస్థ ఆధ్వర్యంలో ప్రతిభా పరీక్షలు నిర్వహించారు. 13 పాఠశాలలకు చెందిన 423 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. వీరిని సబ్‌జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాలుగా విభజించి శ్లోక పఠనం, పద్య పఠనం, వేదం, గేయాలు, వ్యాసరచన, క్విజ్ అంశాల్లో పోటీలు నిర్వహించి, తొలి మూడు స్థానాల్లో నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి మాట్లాడుతూ తల్లి లాంటి తెలుగుభాషను ఇంగ్లిష్ మోజుతో నిర్లక్ష్యం చేయకూడదన్నారు. తెలుగు భాష, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు కృషి చేస్తున్న సుపథ నిర్వాహకులను అభినందించారు. సుపథ వ్యవస్థాపకులు యు.వి.ఎ.ఎస్.రాజు సుపథ నిర్వహణ, ఆవశ్యకతను విద్యార్థులు వారి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు వివరించారు. –

పింఛన్ వ్యథలు..

- సామాజిక పింఛన్ల తనిఖీపై ఆందోళన
- అనర్హుల గుర్తింపు పేరిట పింఛన్ల తొలగింపులకు సిద్ధం
- వెల్దూరు సచివాలయం పరిధిలో పూర్తయిన తనిఖీ
- 11 సర్వే బృందాలతో గ్రామాలలో ఇంటింటికీ జల్లెడ
- ప్రభుత్వానికి నివేదిక అందజేసిన సర్వే అధికారులు



వెల్దూరులో పింఛన్లు ఏరివేతకు సర్వే చేస్తున్న అధికారులు (ఫైల్)

పూసపాటిరేగ: అనర్హులను గుర్తించే క్రమంలో సామాజిక భద్రత పింఛన్ల సర్వే చేపడుతుండడంతో ప్రజల్లో ఆందోళన నెలకొంది. సర్వే పేరుతో నిరుపేదల నోటి కాడ కూడు తీసేందుకు ప్రభుత్వం పావులు కదుపుతోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పింఛన్ లబ్ధిదారుల సంఖ్య కుదింపు చేసేందుకు కసరత్తు చేస్తున్నట్లు చర్చ గుతోంది. అనర్హుల పేరిట ఉన్న పింఛన్లు ఏరివేసేందుకు ఇప్పటికే జిల్లాలో పైలెట్ ప్రాజెక్ట్‌లో భాగంగా పూసపాటిరేగ మండలం వెల్దూరు సచివాలయాన్ని ఎంపిక చేసి, సర్వే కూడా పూర్తి చేసి ఉన్నతాధికారులకు నివేదిక అందజేశారు. పింఛన్ల తనిఖీ కోసం వేసిన 11 బృందాలు గ్రామాలలో పర్యటించి పింఛన్‌దారుల వివరాలు సేకరించారు. పరిశీలనలో గుర్తించిన అంశాలను ఇప్పటికే ప్రభుత్వానికి నివేదించారు. అనంతరం ప్రభుత్వ ఆదేశాల మేరకు పింఛన్ల తొలిగింపు ప్రక్రియ చేపట్టనున్నారు. ఈ పరిణామంతో పింఛన్‌దారులలో ఆందోళన నెలకొంది.

అన్నీ ముంచే పనులే..

మంచి ప్రభుత్వం అని చెప్పి కూటమి ప్రభుత్వం ముంచే పనులు చేస్తోందని పలువురు నిరుపేదలు మండిపడుతున్నారు. వెల్దూరు సచివాలయం పరిధిలో 437 సామాజిక పింఛన్ల తనిఖీ పూర్తి చేశారు. సామాజిక భద్రత పింఛన్ల పరిశీలనలో 13 అంశాలను ప్రామాణికంగా తీసుకున్నారు. ఇదిలా ఉంటే సర్వే పేరుతో అర్హులను కూడా తొలగిస్తారని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రానున్న రోజులలో భారీగా లబ్ధిదారుల సంఖ్య తగ్గించే అవకాశం ఉందనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. అనర్హుల పేరిట అర్హులకు అన్యాయం చేయవద్దని లబ్ధిదారులు కోరుతున్నారు.

ఆందోళనగా ఉంది..

సామాజిక పింఛన్ల తనిఖీ పేరిట అర్హుల పింఛన్లు తొలిగిస్తారనే భయం వెంటాడుతోంది. ఇప్పటికే వెల్దూరులో అధికారులు సర్వే చేశారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన తర్వాత సర్వేలో అసలు లొసుగు బయటపడనుంది. అనర్హులను ఏరివేసినా ఒక్క అర్హుడికి కూడా అన్యాయం జరగకుండా చూడాలి.

– చిన్నారావు, పింఛన్ లబ్ధిదారుడు, పూసపాటిరేగ

మైదానాలు కాదు చెరువులే..

పై ఫొటోలు మైదానంలా కనిపిస్తున్నాయి కదూ.. అలా అనుకుంటే పొరపడినట్లే.. మండలంలోని జొన్నవలస, పినవేమలిలో గల చెరువులు గుర్రపుడెక్కతో నిండిపోవడంతో మైదానంలా కనిపిస్తున్నాయి. ఎవరైనా మైదానం అనుకుని దిగితే మునిగిపోక తప్పదు.

– విజయనగరం రూరల్



జొన్నవలసలోని గుర్రపుడెక్కలతో నిండిన చెరువు



పినవేమలిలో మైదానాన్ని తలపిస్తున్న చెరువు

ఆక్రమణకు అడ్డుకట్ట



హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన సిబ్బంది

నెల్లిమర్ల: నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధి జరజాపుపేటలోని కొత్తవాని చెరువు ఆక్రమణకు రెవెన్యూ అధికారులు ఆదివారం అడ్డుకట్ట వేశారు. స్థానిక కొత్తవాని సాగునీటి చెరువులో కొంతస్థలం ఆక్రమించి, ఇల్లు నిర్మిస్తున్నట్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు అందింది. దీంతో తహసీల్దార్ సుదర్శనరావు స్పందిస్తూ చెరువు ఆక్రమణను పరిశీలించాలని సిబ్బందిని ఆదేశించారు. సుమారు వంద గజాల మేర చెరువులో ఆక్రమణ జరిగినట్లు సిబ్బంది గుర్తించి, హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. చెరువును ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా తహసీల్దార్ హెచ్చరించారు.

పొలం పనుల్లో రైతన్నలు బిజీ



జొన్నవలసలో సేంద్రియ ఎరువును పొలాల్లో వేస్తున్న రైతులు

విజయనగరం రూరల్: ఖరీఫ్ వరి కోతలు పూర్తవ్వడంతో ఒక వైపు చేను మోతలు.. మరోవైపు నూర్పులు జోరుగా సాగుతున్నాయి. అలాగే మరో వైపు మొక్కజొన్న పంట వేసేందుకు రైతులు తమ పొలాల్లో సేంద్రియ ఎరువును వేయడంలో బిజీగా ఉన్నారు. మండలంలోని జొన్నవలస, రాకోడు, గుంకలాం, ద్వారపూడి, పినవేమలి, చెల్లూరు, గొల్లలపేట, చాకలిపేట, తదితర గ్రామాల్లో రైతులు, రైతు కూలీలు వ్యవసాయ పనులు చేస్తూ ఆదివారం కనిపించారు.



రాకోడు గ్రామంలో వరి చేను మోతలో రైతులు

ఆర్టీసీ విస్తరణ ఆలోచన లేకపోవడం దురదృష్టకరం



మాట్లాడుతున్న ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దామోదరరావు

- ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దామోదరరావు

విజయనగరం అర్బన్: ఆర్టీసీని విస్తరించి మరింత బలోపేతం చేయాలనే ఆలోచన ప్రభుత్వానికి లేకపోవడం ఉద్యోగుల దురదృష్టమని ఏపీపీటీడీ (ఆర్టీసీ) ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు ఆరోపించారు. సంఘం జిల్లా కమిటీ కార్యాలయంలో జోన్ నాన్ ఆపరేషన్ రీజియన్ నాయకులతో ఆదివారం నిర్వహించిన కార్మికుల సమావేశంలో ఈ మేరకు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా విజయనగరం, విజయవాడ, నెల్లూరు, కడప మొత్తం 4 చోట్ల ఉన్న వర్క్‌షాపులలో యాజమాన్యం నిర్లక్ష్య చర్యల వల్ల సంస్థ రోజురోజుకీ క్షీణిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. వేల సంఖ్యలో నాన్ ఆపరేషన్ యూనిట్లుగా వర్క్‌షాపుల్లో పనిచేసే ఉద్యోగుల సంఖ్య వందల సంఖ్యలో తగ్గిందన్నారు. సిబ్బందిని తగ్గించాలని, రిటైర్మెంట్ కారణంగా ఖాళీ అయిన పోస్టులలో ఔట్ సోర్సింగ్ పద్ధతిన నియమించాలని యాజమాన్యం చూస్తోందని, ఈ వైఖరి మానుకోవాలని కోరారు. సంస్థ స్వంతంగా బాడీబిల్డింగ్ యూనిట్లను ఏర్పాటు చేసి విస్తరింప చేయాలన్న ఆలోచనలు ప్రభుత్వం చేయకపోడం బాధాకరమని ఆవేదన వ్యక్తంచేశారు. సంఘం రీజినల్ అధ్యక్షుడు అప్పలరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో డిప్యూటీ జనరల్ సెక్రటరీ పి.భానుమూర్తి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.సత్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ వెంకటరావు, విజయనగరం నాన్ ఆపరేషన్ రీజనల్ కార్యదర్శి యర్రంనాయుడు, రీజనల్ అధ్యక్ష కార్యదర్శులు కె.అప్పలరాజు, బాసూరి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడు

- పీటీసీ ప్రిన్సిపాల్ డి. రామచంద్రరాజు
- అమరజీవికి ఘనంగా నివాళులు



విజయనగరం క్రైమ్: పొట్టి శ్రీరాముల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పీటీసీ ప్రిన్సిపాల్ రామచంద్రరాజు, తదితరులు



విజయనగరం క్రైమ్: పొట్టి శ్రీరాముల చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పిస్తున్న ఏఆర్ అదనపు ఎస్పీ నాగేశ్వరరావు, తదితరులు

విజయనగరం క్రైమ్: భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు కారకుడైన పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడని పీటీసీ ప్రిన్సిపాల్ డి.రామచంద్రరాజు అన్నారు. పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకుని పీటీసీలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అమరజీవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పీవీ.అప్పారావు, డీఎస్పీ టి.రమేష్, సీఐలు, ఆర్ఐలు, ఆర్ఎస్సైలు, ఎస్సైలు, పీటీసీ అవుడోర్, ఇన్‌డోర్ కమ్యూనికేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రాణత్యాగం చేసిన మహనీయుడు

విజయనగరం క్రైమ్: ఆంధ్ర రాష్ట్ర అవతరణకు ప్రాణత్యాగం చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములని ఏఆర్ అదనపు ఎస్పీ జి.నాగేశ్వరరావు అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో పొట్టి శ్రీరాముల వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భాషా ప్రయుక్త రాష్ట్రాల సాధన కోసం ఆమరణ దీక్ష చేపట్టి, ప్రాణాలర్పించి, అమరజీవిగా నిలిచిన మహనీయుడని కొనియాడారు. మహాత్ముడు బోధించిన సత్యం, అహింస, హరిజనోద్ధరణ అనే ఆశయాల కోసం తన జీవింతాంతం కృషి చేసిన ఘనత శ్రీరాములదేనన్నారు. కార్యక్రమంలో ఆర్ఐలు ఎస్.గోపాలనాయుడు, ఆర్. రమేష్‌కుమార్, పి.శ్రీనివాసరావు, ఆర్ఎస్సైలు ఎ.రామకృష్ణ, టి.రామారావు, ఎం.డి ముబారక్ అలీ, సీహెచ్.మహేష్, ఎస్‌వీఆర్ పాత్రులు, తదితరులు పాల్గొన్నారు.



విజయనగరం: అమరజీవి పొట్టి శ్రీరాముల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మేయర్ విజయలక్ష్మి, తదితరులు

మహోన్నతమైన వ్యక్తి..

విజయనగరం: ఆంధ్ర రాష్ట్ర అవతరణకు తన ప్రాణాలను సైతం త్యాగం చేసిన మహోన్నత వ్యక్తి పొట్టి శ్రీరాములని మేయర్ వెంపడాపు విజయలక్ష్మి అన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలో అమరజీవి చిత్రపటానికి మేయర్ విజయలక్ష్మితో పాటు ఫ్లోర్ లీడర్ ఎస్‌వీవీ రాజేష్, కమిషనర్ పల్లి నల్లనయ్య, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ.. పొట్టి శ్రీరాములు ఆంధ్రుల మనస్సుల్లో ఎప్పుడూ జీవించే ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



నెల్లిమర్ల: శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కమిషనర్ అప్పలరాజు, తదితరులు

త్యాగం మరువలేనిది..

నెల్లిమర్ల: ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటులో అమరజీవి పొట్టి శ్రీరాముల త్యాగం మరువలేనిదని నెల్లిమర్ల నగర పంచాయతీ కమిషనర్ కె. అప్పలరాజు, వైస్ ఛైర్మన్ సముద్రపు రామారావు అన్నారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో శ్రీరాముల వర్ధంతి కార్యక్రమం నిర్వహిచారు. ఈ సందర్భంగా శ్రీరాముల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

నేత్ర వైద్య శిబిరం

శృంగవరపుకోట: పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఎస్.కోట ఆర్యవైశ్య సంఘం నేతృత్వంలో, శంకర్ ఫౌండేషన్ సౌజన్యంతో వెంకటరమణపేట గ్రామంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రికి చెందిన ఆప్తాలమిస్ట్ దేవి 92మందికి నేత్రపరీక్షలు చేసి 38 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. క్యాంప్ కో–ఆర్డినేటర్ ఎస్. జోగారావు మాట్లాడుతూ ఎంపిక చేసిన 34 మంది వృద్ధులకు శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రిలో ఆపరేషన్‌లు చేయించేందుకు బస్సులో తరలించామని చెప్పారు. శిబిరానికి వచ్చిన వారికి ఆర్యవైశ్య సంఘ సభ్యులు భోజనాలు అందజేశారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలతో వికాస తరంగిణి సభ్యులు

రాజాం సిటీ: స్థానిక వికాస తరంగిణి కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన భగవద్గీత శ్లోకాల పఠన పోటీల విజేతలకు పోటీల అనంతరం బహుమతులు ప్రదానం చేశారు. 12వ అధ్యాయం శ్లోకాలపై ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థుల మధ్య ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత విభాగాల్లో పోటీలు నిర్వహించామని, ఈ పోటీలకు మొత్తం 170 మంది విద్యార్థులు హాజరైనట్లు వికాస తరంగిణి అధ్యక్షుడు వాకచర్ల పైడిరాజు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి, ప్రాథమిక విభాగంలో పొగిరి రేణుక(జెడ్‌పీహెచ్‌ఎస్ పొగిరి), వల్లూరు వంశీకిరణ్ (జెడ్‌పీహెచ్‌ఎస్ బొద్దూరు), బెహర గాయత్రి(ఎంపీపీ ఎస్, పోలీస్‌స్టేషన్ రోడ్డు పాఠశాల)లు మొదటి మూడు స్థానాలు సాధించారు. ప్రాథమికోన్నత విభాగంలో కొనపల లోహిత్‌కుమార్(జెడ్‌పీహెచ్‌ఎస్ బొద్దూరు), పట్నాన పవిత్ర(జెడ్‌పీహెచ్‌ఎస్ మందరాడ), బెవర నవీన్(జెడ్‌పీహెచ్‌ఎస్ బొద్దూరు)లు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు, ఉన్నత విభాగంలో వావిలపల్లి సాయితనూజ, వల్లూరు నాగలక్ష్మి(జెడ్‌పీహెచ్‌ఎస్, బొద్దూరు), పి.సాయిభువన(జెడ్‌పీహెచ్‌ఎస్, పొగిరి)లు తొలి మూడు స్థానాలు కైవసం చేసుకున్నారు. ప్రైవేటు పాఠశాలలకు సంబంధించి, శిశు విభాగంలో ఎల్.లోహిత చంద్ర(ది సన్ స్కూల్), ఎల్.రిషిక(విశ్వశాంతి విద్యాలయం), పి.తన్మయి(ది సన్ స్కూల్)లు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు.. ప్రాథమిక విభాగంలో ఎ.గాయత్రి(సన్ స్కూల్), పాలవలస జస్విన్‌నాయుడు(డీపీపీ పబ్లిక్ స్కూల్), వి.మోక్షశ్రీ(జ్ఞానజ్యోతి విద్యాలయం)లు తొలి మూడు స్థానాలు.. ప్రాథమికోన్నత విభాగంలో టంకాల శృతి (విశ్వశాంతి విద్యాలయం), ఉప్పల రిత్విక్‌సాయి (విద్యానికేతన్), డి.జ్యోత్స్న(జ్ఞానజ్యోతి)లు మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. ఉన్నత విభాగంలో రంప సంధ్య(విశ్వశాంతి), దొర శ్రీనిధి(సన్ స్కూల్), ముద్దన శివ శంకర్(జ్ఞానజ్యోతి విద్యాలయం)లు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు.

ప్రైవేట్ ఎలక్ట్రీషియన్లే దిక్కు..

- సచివాలయాల పరిధిలో జేఎల్ఎంల కొరత
- రెండు, మూడు సచివాలయాలకు ఒక జేఎల్ఎం
- 22 సచివాలయాలకు గాను 9 సచివాలయాల్లో పోస్టులు ఖాళీ



రామవరం సచివాలయం

గంట్యాడ: మండల పరిధిలోని పలు గ్రామాల్లో విద్యుత్ సమస్యలేర్పడితే ప్రైవేట్ ఎలక్ట్రీషియన్లే దిక్కవుతున్నారు. గ్రామాల్లో విద్యుత్ సేవలు అందించేందుకు నియమించిన జూనియర్ లైన్‌మన్ (జేఎల్ఎం) గ్రేడ్ –2 పోస్టులు పూర్తి స్థాయిలో భర్తీ చేయకపోవడంతో విద్యుత్ వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారు. జేఎల్ఎంల కొరత వల్ల రెండు, మూడు సచివాలయాలకు ఒకరిని నియమించారు. దీంతో వారు ఏ గ్రామానికీ పూర్తి స్థాయిలో సేవలు అందించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏ ఇంట్లో విద్యుత్ సమస్య వచ్చినా జేఎల్ఎంలు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో ప్రైవేట ఎలక్ట్రీషియన్లను ఆశ్రయించాల్సిన పరిస్థితి.

ఉన్నతాధికారులకు తెలియజేశాం..

మండలంలో 22 సచివాలయాలుండగా తొమ్మిది సచివాలయాల పరిధిలో జేఎల్ఎంల పోస్టులు ఖాళీగా ఉన్నమాట వాస్తవమే. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

– శ్రీనివాసరావు, ఏఈ, గంట్యాడ విద్యుత్ సబ్‌స్టేషన్

9 సచివాలయాల పరిధిలో..

మండలంలో 22 సచివాలయాలు ఉన్నాయి. ఇందులో 9 సచివాలయాలకు జేఎల్ఎంలు లేరు. నీలావతి, కితుబర్తి, కొండతామరపల్లి, రామవరం, రామభద్రపురం, రేగుబిల్లి, తాటిపూడి, సిరిపురం, జగ్గాపురం సచివాలయాల పరిధిలో జేఎల్ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో పక్క సచివాలయాల జేఎల్ఎంలకు అదనపు బాధ్యతలు అప్పగించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
విజయనగరం
9951602843
Office mail : vzmadvt@gmail.com